# కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం ఎండలే

**ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత**



మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : పంటలను ఎండబెట్టి రైతులను కాంగ్రెస్ దగా చేసిందని ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత విమర్శించారు. రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, హరిప్రియ నాయక్, శంకర్ నాయక్‌తో కలిసి మానుకోట కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతుల పక్షాన కేసీఆర్ మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు తమ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ పలు చోట్ల దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఓ పక్క రైతుల పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులు వికృతానందం పొందుతున్నారని, ఇప్పటికే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు హామీలను అమలు చేయకుండా పబ్బం గడుపుకొంటోందన్నారు.

**రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్**

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను కాంగ్రెస్ గోస పెడుతున్నదని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో పుష్కలంగా సాగునీరు అంది రెండు పంటలు పండించిన రైతులను కాంగ్రెస్ అరిగోస పెడుతోందన్నారు. రైతులను మోసం చేసే విధానాలు అవలంబిస్తే ఊరుకునేదే లేదని, బీఆర్ఎస్ తరఫున రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, మర్రి రంగారావు, ఎండీ ఫరీద్, బానోత్ రవి కుమార్, బజ్జూరి పిచ్చిరెడ్డి, నజీర్, యాకుబ్‌రెడ్డి, మందుల రఘు, హరి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**25 వేల పరిహారం చెల్లించాలి : ఎమ్మెల్సీ రవీందర్ రావు**

సకాలంలో ప్రభుత్వం సాగు నీరు అందించకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలన్నారు. బీఆర్ఎస్ ఎప్పుడూ రైతుల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు.



వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# రేవంత్‌రెడ్డి పాలన రైతులకు శాపం

**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

ఖిలావరంగల్, ఏప్రిల్ 2: కేసీఆర్ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్న వ్యవసాయరంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. వరంగల్ జిల్లాలో రైతు సమస్యల పరిష్కారం, పంటలకు మద్దతు ధర, బోనస్ రూ.500 చెల్లించాలని కోరుతూ కలెక్టర్ పీ ప్రావీణ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని ఒకసారి, నీళ్లు సరిపడా లేవని ఒకసారి ప్రకటనలు చేస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేయక పంటలు ఎండి రైతులు అరిగోస పడుతున్నారని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలతో గతంలో పంట నష్టం జరిగితే నాటి సీఎం కేసీఆర్ ఉగాది రోజు 103 డిగ్రీల జ్వరం ఉన్నా వరంగల్‌కు వచ్చి రైతులను ఓదార్చారని గుర్తు చేశాడు.

రాజకీయాలకతీతంగా పంట నష్టం కింద ఎకరానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అవగాహన లేక, లౌక్యం లేక, బుద్ధి లేక తప్పుడు ప్రకటనలు చేసి రైతులను మోసం చేసిందన్నారు. ఫలితంగా రైతుల పంటలు ఎండిపోయి నష్టం జరిగిందని, ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ కాల్వ కింద డీబీఎం-38, 40, 48తో పాటు స్టేజీ-1, 2లో ఉన్న మొత్తం కాల్వల్లో 50శాతం కూడా సాగు నీరు ఇవ్వలేదన్నారు. డీబీఎం-38 కింద అతి పెద్ద కెనాల్ ఎస్సారెస్పీ మొత్తం 98 కిలోమీటర్లు ఉందన్నారు. గీసుగొండ నుంచి భూపాలపల్లి చిట్యాల వరకు ఉన్న ఈ కెనాల్‌లో 925 క్యూసెక్‌ల నీటిని విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 470 క్యూసెక్‌ల నీరు కూడా దాటలేదన్నారు. గత నెల ఎల్ఎండీ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా వరంగల్‌కు వచ్చే నీటిని బంద్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటన విడుదల చేశారన్నారు. రాష్ట్ర పంట షెడ్యూల్‌కు, తూర్పు వరంగల్ షెడ్యూల్‌కు 45 రోజుల వ్యత్యాసం ఉందన్నారు. పంటలకు సాగు నీరు అవసరమన్నారు. మక్కజొన్న పంటలకు ఇంకా రెండు తడుల నీటిని అందించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 8వ పేజీలో చాలా స్పష్టంగా మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఖరీఫ్‌కు ఇవ్వలేదని, దీంతో రైతులు రూ.146 కోట్లు నష్టపోయారన్నారు. కనీసం యాసంగి పంటలకైనా ఇవ్వాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు రాకుండా కొంతమంది మిల్లర్లకు, దళారులకు విక్రయిస్తారన్నారు. వీరందరికి వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతుబంధు ఏ విధంగా నేరుగా రైతుల అకౌంట్లలో పడుతుందో అదే విధంగా బోనస్ కూడా వేయాలన్నారు. సాగునీటితో పాటు కనీసం యాసంగి బోనస్ చెల్లించకుంటే ఈ నెల 6న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలి.. ఎండుతున్న పంటలను సర్వే చేయించాలి

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి.. కలెక్టర్లకు బీఆర్ఎస్ నేతల వినతి

# పరిహారం ఇవ్వండి.. బోనస్ చెల్లించండి..

**ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలి**



ఎండిన పంటలకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టి మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ ఇస్తామన్న క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లకు మంగళవారం వినతిపత్రాలు అందించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, హరిప్రియ నాయక్, శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, ములుగు జడ్పీ అధ్యక్షురాలు నాగజ్యోతి, జనగామ జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గిరబోయిన భాగ్యలక్ష్మి, పోకల జమున వినతిపత్రాలు అందించి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. షెడ్యూల్ ప్రకారం నీళ్లు విడుదల చేయక పంటలు ఎండి రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన చెందారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎప్పుడూ రైతుల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 2



జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

# కాంగ్రెస్ తెచ్చిన కరువు : జనగామ నేతలు

జనగామ, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని, ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జనగామ కలెక్టర్‌కు షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గిరబోయిన భాగ్యలక్ష్మి, పోకల జమున, నర్మెట ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జడ్పీటీసీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను విన్నవించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అన్నారు. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి నాలుగు నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అవగాహన రాహిత్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, రైతులకు బీఅర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, వాంకుడోతు అనిత, బొట్ల శ్రీనివాస్, పేర్ని స్వరూప, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌస్ పాషా, మండలాధ్యక్షుడు యాదగిరిగౌడ్, బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు చెంచారపు పల్లవి, బీఆర్ఎస్ నాయకులు పసుల ఏబెల్, బండ యాదగిరిరెడ్డి, పెద్ది రాజిరెడ్డి, గద్దల నర్సింగారావు, గజ్జెల నర్సిరెడ్డి, రావెల రవి, ముద్దసాని వెంకట్‌రెడ్డి, ఆగారెడ్డి, ఉడుగుల కిష్టయ్య, తిప్పారపు విజయ్, ఉల్లెంగుల దిలీప్, దేవునూరి సతీశ్, రాజు పాల్గొన్నారు.



జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

# రైతుల పరిస్థితి దుర్భరం

**బీఆర్ఎస్ జయశంకర్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి**

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పాలనలో రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రాకు పార్టీ శ్రేణులతో కలిసి ఆమె వినతి పత్రాన్ని అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం మన జిల్లాలోనే ఉన్నా సాగు నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారని చెప్పారు. ప్రాజెక్ట్‌లో వెంటనే కాఫర్ డ్యాం నిర్మించి రైతులకు సాగు, తాగు నీరు అందజేయాలని, చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. పది మందికి అన్నం పెట్టే రైతన్న కన్నీటితో తన ఆకలి చంపుకొనే దుస్థితికి చేరుకున్నాడని ఆవేదన చెందారు. రైతుబంధు రూ.15 వేలు, రుణమాఫీ రూ.2లక్షలు, మద్దతు ధరకు రూ.500 బోనస్, ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం, నాణ్యమైన 24 గంటల కరెంట్, అప్పుల బాధతో మరణించిన రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న జిల్లా కేంద్రంలో నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ములుగు కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న జడ్పీ అధ్యక్షురాలు బడే నాగజ్యోతి

# రూ.500 బోనస్ హామీ గాలికి

**ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి**

ములుగు రూరల్, ఏప్రిల్ 2 : రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా బీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని, రైతులకు అండగా ఉంటామని ములుగు జడ్పీ అధ్యక్షురాలు బడే నాగజ్యోతి అన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు ఆమె వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ ఆమె మాట్లాడుతూ మద్దతు ధరపై క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ గాలికి వదిలేసిందన్నారు. బోనస్ ఇవ్వకుంటే 6న నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. నష్టాల్లో ఉన్న రైతులకు సర్కారు మద్దతుగా నిలువాలన్నారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భూక్య మురళి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, లాలూ నాయక్, నాయకులు రమేశ్‌రెడ్డి, భిక్షపతి, ఓదెలు, గండి కుమార్, చంద్రమౌళి, రాందాస్, రాణాప్రతాప్, గరిగె రఘు, తిరుపతి, శ్రీనివాస్, కాసీం, జంపన్న, దిలీప్, మహేందర్, నాజర్‌ఖాన్, జితేందర్, సురేశ్‌రెడ్డి ఉన్నారు.

# నిట్‌లో 5 నుంచి స్ప్రింగ్ స్ప్రీ

**మూడు రోజుల పాటు వేడుకలు.. పాల్గొననున్న ప్రముఖ సింగర్స్**




హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: వరంగల్ నిట్ ఈనెల 5 నుంచి 7 వరకు వార్షిక సాంస్కృతిక ఉత్సవం స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైంది. 1978 నుంచి ఈ కార్యక్రమం దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటి. స్ప్రింగ్ స్ప్రీ కళ, సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్ షో, రాక్ మ్యూజిక్ కాంపిటీషన్ విభాగాల్లో అనేక ఈవెంట్లను ప్రదర్శిస్తారు. స్పాట్‌లైట్ ఈవెంట్లు(నాటకం, నృత్యం, కళలు), కొరియోనైట్ (డ్యాన్స్), అల్లూర్ (ఫ్యాషన్ షో), డైరెక్టర్స్ కట్ (కళాకారులు దర్శకులను ప్రోత్సహించే కార్యక్రమం), నుక్కడ్ నాటక్(సామాజిక సమస్యలపై దృష్టిసారించే వీధి నాటకం) వివిధ క్లబ్‌ల నుంచి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సంవత్సరం, రెండు ప్రోషోలు ఉంటాయి. ఏప్రిల్ 5న గాయకుడు హరిచరణ్, ప్రముఖ సౌత్ ఇండియన్ రాక్ బ్యాండ్ రస్తా ప్రదర్శన ఇవ్వనున్నట్లు, 6న గాయకుడు నకాశ్ అజీజ్, ఇండియన్ రాక్ బ్యాండ్ లోహర్-ది బ్లాక్ స్మిత్ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నిట్ విద్యార్థులు, ఇతర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య తెలిపారు.




వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

# ఇద్దరు నకిలీ మావోయిస్టుల అరెస్ట్

సుబేదారి, ఏప్రిల్ 2: ఇద్దరు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్‌కు చెందిన దాసరి శ్రీకాంత్, వరంగల్ కరీమాబాద్‌కు చెందిన బాలిని మహేశ్ కలిసి భారత కమ్యూనిస్టు మావోయిస్టు పార్టీ చర్ల-శబరి ఏరియా కమిటీ కమాండర్ దేవన్న పేరుతో నకిలీ లెటర్‌ప్యాడ్ సృష్టించారు. అనంతరం హనుమకొండలోని అజర, దీపక్ స్కిన్ క్లినిక్ హాస్పిటల్, ఎన్ఎస్ఆర్ గ్రూప్ సంస్థ యాజమాన్యాలకు రోగుల నుంచి అడ్డగోలుగా డబ్బులు తీసుకుంటున్నారని లేఖలు పంపించి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. లేకుంటే ఈడీ, సీబీఐకి పట్టిస్తామని, నక్సల్స్ చేతిలో చచ్చిపోతారని హెచ్చరించారు. ఆయా యాజమాన్యాల ఫిర్యాదుతో విచారించిన పోలీసులు బెదిరింపులకు పాల్పడింది శ్రీకాంత్, మహేశ్ అని నిర్ధారించి అరెస్టు చేశారు. నకిలీ లెటర్ ప్యాడ్, బైక్, రెండు ఫోన్ల స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

# మాదిగలను అణచివేస్తున్న కాంగ్రెస్

**ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్**

**కాశీబుగ్గ చౌరస్తా, పరకాలలో రేవంత్‌రెడ్డి, మల్లికార్జున ఖర్గే, కడియం దిష్టిబొమ్మ దహనం**

కాశీబుగ్గ, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగలను రాజకీయంగా అణచివేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ధ్వజమెత్తారు. కాశీబుగ్గ చౌరస్తాలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆ ముగ్గురి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని లోక్‌సభ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఒక్క టికెట్ కూడా మాదిగలకు అవకాశం ఇవ్వకుండా ద్రోహం చేశారని మండిపడ్డారు. మాదిగలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిరకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.



పరకాల: ఖర్గే, రేవంత్‌రెడ్డి, కడియంల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కార్యక్రమంలో నాయకులు కోట రాజు, గంగారాపు మల్లన్న, ఇసంపెల్లి రాజు, బిర్రు చిన్న మహేందర్, మామునూరి అనిల్, పిడకల సంపత్, కోట చంద్రశేఖర్, జన్ను దినేశ్ పాల్గొన్నారు.

**వరంగల్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయం**

పరకాల: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్కసీటు కూడా కేటాయించకుండా మోసం చేసిందని, వరంగల్‌లో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి ఖాయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రాజు అన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడంపై పరకాలలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్, నాయకులు చాతాళ్ల రమేశ్, జిల్లెల్ల మురళి, ఇనుముల పూర్ణయ్య, గజ్జి మధు, గోవిందు రవి కుమార్, పరికి విజయ్, రఘు, ప్రసాద్, ప్రదీప్, వినయ్, నాగరాజు, జైపాల్ పాల్గొన్నారు.